క్లుప్తంగా

భారతీ నగర్ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్ చెరు): భారతీ నగర్ డివిజన్ పరిధిలోని కాలనీలా అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎల్ఐజీ కాలనీలో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థను ఆధునికరిస్తున్నామన్నారు. జీహెచ్ఎంసీ విద్యుత్ శాఖ అధికారుల సమావేశంలో మంజూరైన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆదర్శ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ



పండ్లను పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జహీరాబాద్ టౌన్: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ సభ్యుడు, కార్మిక నాయకుడు ఎంజీ రాములు జన్మదినం పురస్కరించుకుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు రాజు, విజయ్, కేషుసింగ్, ఎంపీటీసీ సభ్యులు రాములు, కిషన్ రాథోడ్, నారాయణ, మోహన్‌రెడ్డి, ఇస్మాయిల్, శ్రీశైలం, వాసునాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కలర్‌కిట్స్ పంపిణీ



కలర్ కిట్స్‌ను చూపుతున్న విద్యార్థులు

నారాయణఖేడ్: ర్యాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనంలో నైపుణ్యం పెంపొందించుకునేందుకు, పెడిలైట్ ఏజెన్సీ నిర్వాహకులు బడ్ల శోభన్‌గుప్త 158మందికి శుక్రవారం రంగిలా కలర్‌కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో చక్కటిరాతలతో ప్రతిభ, స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు, రాత్రివేళల్లో గ్రూపులవారిగా చదువులు ఇలా వినూత్న ఆలోచనలతో విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వారు చిత్రకళల్లోనూ రాణించాలని కలర్‌కిట్స్ పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న తహసీల్దార్ ప్రభు

రాయికోడ్(అందోల్): క్రిష్ణాపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మామిడిపల్లి గ్రామ వీఆర్ఏ సాదక్ అలీ మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని తహసీల్దార్ ప్రభు, రెవెన్యూ సిబ్బంది గురువారం పరామర్శించారు. తక్షణ సాయంగా రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. రోడ్డు ప్రమాదంలో వీఆర్ఏ అకాల మృతి చెందడం బాధాకరమని తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజు, ఆర్ఐ ప్రభాకర్, వీఆర్ఏలు వీరేందర్, శివకుమార్, అశోక్ కుమార్, శ్రీశైలం, గోపాల్, రత్నం, మహేశ్, ఇస్మాయిల్, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సమాఖ్య భవనం ప్రారంభం

పటాన్‌చెరు: అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని రెండో వార్డులో రూ.30లక్షలతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి పరిశీలించారు. శనివారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి భవనాన్ని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండో వార్డు కౌన్సిలర్ కృష్ణ, అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ సుజాత పాల్గొన్నారు

ఆర్టీసీకి రూ.52లక్షల ఆదాయం

సంగారెడ్డి టౌన్: మహాశివరాత్రి సందర్భంగా ఏడుపాయలకు 118 బస్సులను నడిపారని దీంతో రూ.52లక్షల ఆదాయం ఆర్టీసీకి సమకూరిందని మెదక్ డిప్యూటీ రీజియన్ మేనేజర్ దైవదినం శుక్రవారం తెలిపారు.

కుక్కలతో భయం..భయం..

- రహదారులపై స్వైర విహారం
- బెంబేలెత్తుతున్న జనం
- పట్టించుకోని అధికారులు



మునిపల్లి: రహదారులపై సంచరిస్తున్న వీధికుక్కలు

మునిపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో వీధి కుక్కలు, పగలు, రాత్రి తేడా లేకుండా రహదారులపై స్వైర విహారం చేస్తున్నాయి. కాలినడకనవెళ్తున్నా, వాహనదారులను సైతం వెంబడిస్తున్నాయి. వెంట పడి దాడిచేస్తున్నాయి. దీంతో ఇక్కడి స్థానిక జనం భయం..భయంగా ఉంటున్నారు. రాత్రిల్లో వివిధ పనులపై కిరాణ దుకాణాలకు వెళ్తున్న వారి వెంట పడి కరిచేస్తున్నాయి. కుక్కల కాటుకు గురై పలువురు వ్యక్తులు ఆస్పత్రికి వెళ్లిన సంఘటనలు లేకపోలేదు. ఈ విషయంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

వీధికుక్కలను పట్టుకోవడంలో విఫలం

గ్రామాల్లో వీధి కుక్కల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుంది. రహదారులపై తిరిగే ప్రయాణికులను వెంబడిస్తున్నాయి. మున్సిపల్ సిబ్బంది కుక్కలను పట్టుకొని వైద్యం చేయడంలో విఫలమవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. గొర్లకు కాపల ఉండే కుక్కలు వాటిపై దాడి చేసి చంపేస్తున్నాయి. జనవరిలో 33 మందికి కాటు వేయగా వారిలో 31మంది చికిత్సలు చేయించుకున్నారు. ఫిబ్రవరిలో 24 మందికి కాటు వేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సంధ్య తెలిపారు.

కుక్కలు, కోతుల బెడద నుంచి కాపాడండి



జిన్నారం: కమిషనర్ రాజేంద్రకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆనందకృష్ణారెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): కుక్కలు, కోతుల బెడద నుంచి ప్రజలను కాపాడాలని బీజేపీ సీనియర్ నేత ఆనందకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం బొల్లారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. చిన్న, పెద్ద తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ దాడి చేస్తున్నాయన్నారు. ఈ విషయంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

పరస్పర సహకారంతోనే గ్రామాల అభివృద్ధి

ఎంపీపీ ప్రియాంకరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రియాంకరెడ్డి

జహీరాబాద్ టౌన్: పరస్పర సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని మొగుడంపల్లి మండల ఎంపీపీ ప్రియాంకరెడ్డి అన్నారు. శుక్రవారం సర్వసభ సమావేశంలో మాట్లాడుతూ పలు గ్రామ పంచాయతీ భవనాలు, సీసీ రోడ్లకు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. గ్రామాల్లో నిర్మించిన క్రీడా ప్రాంగణాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ధనసిరిలో నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను వెంటనే పూర్తి చేయాలని సభ్యులు కోరారు. ఈ సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ విజయరెడ్డి, ఎంపీడీఓ మహేశ్, ఉపాధ్యక్షురాలు హసీనా బేగం, సర్పంచ్‌లు బ్రహ్మానందరెడ్డి, ఓంకార్, కీరు చౌహన్, ఎంపీటీసీ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల మందు వేయించాలి



జోగిపేట(అందోల్): నట్టల నివారణ మందులు వేస్తున్న దృశ్యం



న్యాల్‌కల్(జహీరాబాద్): నట్టల నివారణ మందు వేస్తున్న అజింక్యా

న్యాల్‌కల్(జహీరాబాద్): జీవాలకు వ్యాధులు రాకుండా ఉండేందుకు నట్టల నివారణ మందులను తప్పకుండా వేయించాలని పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి అజింక్యా అన్నారు. శుక్రవారం మిర్జాపూర్(ఎన్) గ్రామంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎంఏ ఘనీ తదితరులు పాల్గొన్నారు.

మునిపల్లి(అందోల్): గొర్ల, మేకలకు ప్రభుత్వం ఉచితంగా నట్టల నివారణ మందును పంపిణీ చేస్తుందని జడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఖమ్మంపల్లిలో గొర్రె, మేకలకు నట్టల నివారణ మందులను పశువైద్యులు డాక్టర్ సంతోష్ కుమార్ వేశారు. ఈ పశు వైద్య శిబిరాన్ని పశుకాపరులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ కోరారు.

జోగిపేట(అందోల్): రాంసానిపల్లిలో శుక్రవారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను వేశారు. గ్రామంలోని 670మేకలకు, 80 గొర్రెలకు మందులు వేసినట్టు పశువైద్య అధికారి డాక్టర్ సాకేత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాములు, వెటర్నరీ సిబ్బంది శ్రీదేవి, కృష్ణయ్య పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ జయరాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని రామచంద్రాపురం తహసీల్దార్ జయరాం అన్నారు. శుక్రవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలను ఆయన సందర్శించారు. పదోతరగతి స్పెషల్ క్లాసులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు తీసుకరావాలన్నారు. ప్రత్యేక తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు పండ్లు, పండ్ల రసాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోచయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రాథోడ్, రాజకుమారి, అనిత రెడ్డి, థావుర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): పదోతరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ మారుతి రాథోడ్ అన్నారు. శుక్రవారం రేజింతల్ జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి ఉత్తీర్ణతకు సంబంధించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయం దగ్గర పడుతున్నందునా విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు.

ఉపాధి హామీ పనులపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఝరాసంగం(జహీరాబాద్): ఉపాధి హామీ పనులపై కూలీలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ సుజాత సూచించారు. శుక్రవారం ఝరాసంగం ప్రజాపరిషత్తు కార్యాలయంలో ఆమె పంచాయతి కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ రాజ్‌కుమార్, పంచాయతి కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ 18 మందికి కోవిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 18 మందికి కోవిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు వైద్యసిబ్బంది మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 13 మందికి నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

◆ హనుమాన్ దీక్షలు ప్రారంభం

నారాయణఖేడ్: కొండాపూర్ హనుమాన్ ఆలయ ఆవరణలో శుక్రవారం అఖిల భారత సాధు సంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహరాజ్ హనుమాన్ దీక్షలు స్వీకరించిన వారికి మాలధారణ చేశారు. ఈ సందర్భంగా సంగ్రాం మహరాజ్ మాట్లాడుతూ దీక్షల సమయంలో ప్రతీ ఒక్కరూ నియమ నిష్ఠలతో గడపాలని సూచించారు.

◆ నేడు బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

వట్‌పల్లి(అందోల్): బిజిలీపూర్ గ్రామం నుంచి బుద్దాయిపల్లి మీదుగా గడిపెద్దాపూర్ వెళ్లే బీటీ రోడ్డు నిర్మాణానికి శనివారం అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ శంకుస్థాపన చేయనున్నట్లు ఎంపిటీసీ నవీన, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శివాజీరావు తెలిపారు.

◆ మార్చి 12 వరకు రోడ్డు మూసివేత

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఈద్గా వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి, రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నందునా మార్చి 12 వరకు రోడ్డు మూసేస్తారని ఆర్అండ్‌బీ డీఈఈ నర్సింలు తెలిపారు. ఈ నెల 25 వరకు పనులు పూర్తికావల్సి ఉండగా క్యూరింగ్ పనులు మిగిలిపోయాయని చెప్పారు.

◆సైఫ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

నారాయణఖేడ్: వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల పీజీ విద్యార్థిని ఆత్మహత్యయత్నానికి కారకుడైన సైఫ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రకాష్‌రాథోడ్, జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, కళాశాల ప్రిన్సిపాల్, హెచ్‌డీవో నిర్లక్ష్యం వల్లే ఆమె ఆత్మహత్యయత్నానికి పాల్పడిందని ఆరోపించారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న రోషణ్‌రెడ్డి

నారాయణఖేడ్: నాగాపూర్‌కు చెందిన పిప్లిబాయికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కు రూ.36వేలు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సహకారంతో శుక్రవారం అందజేశారు. లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశ్యంతో ఆయన తనయుడు ఎంబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ రోషణ్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించలేదు

సాక్షి, సిటీబ్యూరో: పటాన్‌చెరు మండలం, నందిగామలో నిర్మిస్తున్న విల్లా ప్రాజెక్టుకు ప్రభుత్వ అనుమతులు లేవని, నిబంధనలను అతిక్రమించినట్లు సామాజిక మాధ్యమాలలో వస్తున్నవార్తా కథనాలు అసత్యమని ఆ సంస్థ అస్పైర్ స్పేసెస్ ఒక ప్రకటనలో తెలిపింది. సంబంధిత సర్వే నంబర్లలో భూమిని చదును చేయటం, రహదారులు, డ్రైనేజీ వంటి ఇతరత్రా పనులేవీ చేయడం లేదని పేర్కొంది. ప్రాజెక్ట్ ప్రాంతంలో కంపెనీ ఆఫీసు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌ల వంటివేవీ ఏర్పాటు చేయలేదని కంపెనీ ఎండీ టీవీ నర్సింహా రెడ్డి తెలిపారు.

మెరుగైన సేవలు అందిస్తాం



అవగాహన కల్పిస్తున్న డిపో మేనేజర్

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లేశయ్య అన్నారు. ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చీకూర్తిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెళ్లిల్లు, శుభ కార్యాలకు బస్సులను తీసుకెళ్లే వారికి 10 శాతం రాయితీ కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిపో సహాయక మేనేజర్ ప్రవీణ్‌కుమార్, మార్కెటింగ్ ఇన్‌చార్జి పాండు గ్రామ పెద్దలు భూంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచి ఆహారం తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్ శ్యామల

న్యాల్‌కల్(జహీరాబాద్): తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని మిర్జాపూర్(బి)పీహెచ్‌సీ సూపర్ వైజర్ శ్యామల అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీలో గర్భిణిలకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

బోరంచలో భక్తుల తాకిడి



అమ్మవారిని దర్శించుకున్న సర్వేశ్వర మహరాజ్

నారాయణఖేడ్: బోరంచలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బోరంచ నల్లపోచమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక అలంకరణ, ప్రత్యేకపూజాది కార్యక్రమాలు జరిగాయి. ఉదయం నుంచి భక్తుల తాకిడి అధికంగా ఉంది. దుద్యాల సర్వేశ్వర మహరాజ్ అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి నగేష్ స్వామి ఆధ్వర్యంలో పూజలు కొనసాగాయి.

ప్రభుత్వ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో శాంతి కుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ శరత్, జిల్లా అధికారులు

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి శాంతి కుమారి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి కంటి వెలుగు, పట్టణ ప్రాంతాలలో డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణం, 58, 59జీఓల అమలు, పోడు భూములు, ఆయిల్ పామ్ సాగుపై కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పట్టాలు లేకుండా ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు, ఆబాది గ్రామకంఠం, శిఖం, వక్ఫ్, దేవాదాయ భూముల క్రమబద్ధీకరణ చేసేందుకు అనుసరించాల్సిన విధానంపై నివేదిక తయారు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా కంటి వెలుగు శిబిరాలను విజయవంతంగా నిర్వహిస్తున్నందునా వారిని అభినందించారు. ఇప్పటి వరకూ 25 పని దినాల్లో 51.86 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించారని, జిల్లాలకు చేరే ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాల పంపిణీ పూర్తి చేసిన వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేయాలన్నారు. పోడు భూముల పంపిణీ, పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ శరత్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గాయత్రీ దేవి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి టౌన్: మధ్యాహ్నం బలుబులు వెలగకుండా చూడాలని కలెక్టర్ శరత్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో మధ్యాహ్నం బలుబులు వెలగకుండా చర్యలు తీసుకోవాలని, థర్డ్ వైర్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మండల ఎంపిఓలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా పంచాయితీ అధికారి సురేష్ మోహన్, తదితరులు పాల్గొన్నారు

దేవాలయాల అభివృద్ధికి సహకరిస్తా

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



భూమిపూజ చేసిన ఎమ్మెల్యే

జిన్నారం(పటాన్‌చెరు): దేవాలయాల అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శివనగర్ గ్రామంలో అయ్యప్ప స్వామి, సాయిబాబా ఆలయ నిర్మాణా పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా దేవాలయ నిర్మాణాలకు, పురాతన ఆలయాల పునరుద్ధరణకు సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ రేఖ, ఎంపీటీసీ సంతోషి, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంకటేశ్‌గౌడ్, కృష్ణ, మహేశ్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పంచాయతీగా వడక్‌పల్లి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



అభివృద్ధి పనుల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: వడక్‌పల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. రూ.40లక్షలతో నిర్మించ తలపెట్టిన మినీ ఫంక్షన్ హాల్, రూ.10లక్షలతో బతుకమ్మ ఘాట్, రూ.10 లక్షలతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. రూ.70లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.35లక్షలతో చేపట్టిన అంతర్గత మురుగునీటి కాలువలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ..రూ.2 కోట్లతో వడకపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. గ్రామంలో నిర్మించనున్న దేవాలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. రామాలయ నిర్మాణానికి తన వంతు సాయంగా రూ.20లక్షల విరాళాన్ని ప్రకటించారు. పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ రూ.10లక్షలు, సర్పంచ్ రూ.10లక్షలు ప్రముఖ వ్యాపారి సీసాల రాజు రూ.10లక్షలు విరాళాలను ప్రకటించారు. అనంతరం సుల్తాన్పూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ మల్లికార్జున దేవాలయ భూమి పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, సర్పంచులు లలితా మల్లేష్, నరసమ్మ, ఎంపీడీవో మల్లీశ్వర్, వైస్ ఎంపీపీ సునీత సత్యనారాయణ, సీనియర్ నాయకులు రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): బిజిలీపూర్ మాజీ సర్పంచ్ తనయుడు రాములు కాంగ్రెస్‌ని వీడి శుక్రవారం అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరాడు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్‌లో చేరినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలన చూసి బీఆర్ఎస్‌లోకి వలసలు కొనసాతున్నయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మారావు, నాయకులు సదానందం తదితరులు పాల్గొన్నారు.

జీతాలు పెంచాలని సంతకాల సేకరణ



సంతకాలను సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

జహీరాబాద్ టౌన్: కాంట్రాక్టు కార్మికుల జీతాలను పెంచాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం మహీంద్ర అండ్ మహీంద్ర కర్మాగారం వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి మాట్లాడుతూ వేతన సవరణకాలం గడిచినా ఇంత వరకు కార్మికుల వేతన సవరణ చేపట్టడంలేదన్నారు. ప్రభుత్వాలు స్పందించి షెడ్యూల్ ప్రకారం వేతనాలను పెంచాలని, కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కనకారెడ్డి, వీరయ్యగౌడ్, నసీర్ తదితరులు పాల్గొన్నారు.

యువత వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి

వికాస్ సంస్థ చైర్మన్ కొత్తకాపు లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న కొత్తకాపు లక్ష్మారెడ్డి

జహీరాబాద్ టౌన్: యువత వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జి అండ్ సర్వీసెస్(వికాస్) చైర్మన్ కొత్తకాపు లక్ష్మారెడ్డి కోరారు. ఇండియా లిమిటెడ్ కంపెనీ ఆర్థిక సాయంతో నడుస్తున్న వికాస్ ఆధ్వర్యంలో పస్తాపూర్‌లో ఐటీఐ కాలేజీలో శుక్రవారం వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జహీరాబాద్‌లో పెద్దెత్తున పరిశ్రమలు మంజూరవుతాయని, భవిష్యత్‌లో ఇది పారిశ్రామికంగా బాగా అభివృద్ధి చెందుతుందన్నారు. పరిశ్రమల్లో యువతకు మెండైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. తమ సంస్థ నిర్వహించే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రాడక్టివిటీ కౌన్సిల్ సీనియర్ కన్సల్టెంట్ సిద్ధిఖ్, డిప్యూటీ డైరెక్టర్ సంతోష్ కుమార్, ప్రిన్సిపాల్ ఇర్ఫాన్, వికాస్ ట్రస్టీ రావి నరసింహా రెడ్డి, కొత్తకాపు సురేందర్ రెడ్డి, నింగమ్ రామచంద్రా రెడ్డిలు పాల్గొన్నారు.

బడంపేట శ్రీ రాచన్న స్వామి జాతర



ధ్వజారోహణ చేస్తున్న దృశ్యం

కోహీర్(జహీరాబాద్): సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బడంపేట శ్రీ రాచన్న ప్రభు స్వామి వార్షిక జాతర ఉత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అమృత గుండములో గంగపూజ నిర్వహించి పవిత్ర జలాన్ని తెచ్చి స్వామివారికి అభిషేకాలు, అన్నపూజలు నిర్వహించారు. గోపూజ అనంతరం ధ్వజారోహణ, అఖండ దీప ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. మంగళవాయిద్యాలతో అడవిలో భక్తులు శ్రీ చెన్నవీరయ్య స్వామి తపస్సు చేసిన గుహకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ శివయోగి శివాచార్య మహాస్వామి తంగెడపల్లి వారు ప్రవచనాలు తెలిపారు.